# కపి జాతకం 1

**శా**స్త వేళువన విహారంలో ఒక చెట్టుకింద విశ్రమిస్తున్నాడు. ఇద్దరు మాగధ ఉపాసకులు వర్షాకాలంలో శాస్త ఎక్కడ ఉంటా రని అడుగుతున్నారు. ఆయన మాట్లాడలేదు. చల్లటిగాలి ఆయన శరీరానికి సేదతీరుస్తోంది. కళ్లు మూసుకున్నాడాయన. ఇంతలో ఇద్దరు భిక్షువులు హడావుడిగా వచ్చి శాస్తకి ఎడంగా ఆగి నిలబడిపోయారు కళ్లు తెరిచి ఆయన లేచి కూచున్నాడు.

"భన్తే......"

'ఆయుష్మాన్ ఏమైంది?"

"భన్తే, అంధక భిక్షువులు ఇద్దరు వాదులాడుకుంటున్నారు. ఎంత చెప్పినా వినిపించుకోవడం లేదు."

"దేని గురించి?"

"కోతి గురించి. ఒక భిక్షువు బట్టల్ని చింపివేసింది. దాన్ని కర్రతో కొట్టి హింసించాడు. అతని మిత్రుడు వాదనకు దిగి గొడవ పడుతున్నాడు. ఈ గొడవకి ఉపాసిని వకుళ మూర్ఛపోయింది. భన్తే, ఇద్దరూ ఆగ్రహంలో ఉన్నారు."

శాస్త కళ్లు మూసుకున్నాడు. కొన్ని క్షణాల తరువాత కళ్లు తెరిచి చిరునవ్వుతో అన్నాడాయన.

"కూచోండి. ఈ అంధక భిక్షువులు ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా కోతి గురించి వాదులాడతారు. కోతి వాళ్లకి జ్ఞానోదయం కలిగిస్తుంది."

"భన్తే, అంధక భిక్షువుల భవిష్య జన్మ గురించి తెలుసుకోవాలనుంది."

"సరే వినండి."

కళ్లు మూసుకుని శాస్త చెప్పడం ప్రారంభించాడు.

. . .

“మీరు తొరగా కానివ్వాలండి. మేం తెత్తా ఉంటాం, మీరు బేగే కోసెయ్యాలండి మరి.”

“కోసెయ్యడానికి ఇదేం సొరకాయలనుకున్నావా? మిగతావాటికి తాళం వేసి నువ్వెళ్లు. నేను కమీషనరుగారితో మాట్లాడతాను.”

వచ్చినతను డాక్టరుగార్ని ఓసారి చూసి ‘ఆయ’ అని వెళ్లిపోయాడు. డా. రసూల్ మరో సిగరెట్టు వెలిగించాడు. అతని కేవీ అర్థం కావడంలేదు. నిజానికి అతనికేగాదు ఆపరేషన్ దగ్గిర సహాయంచేసే మేరీ సరోజినికి కూడా ఏవీ అర్థం కావడంలేదు. ఆపరేషన్ గది నల్లటి కప్పువేపు చూసి కళ్లు మూసుకుని మేరీ నిశ్శబ్దంగా ప్రార్థించడం గమనించాడు రసూల్. అతనికి ఇందులో భగవంతుడి ప్రమేయం ఉందనిపించడం లేదు.

“రెడీ సార్. కమీషనరుగారు తొందరపడుతున్నారంట గదండి?” అంది మేరీ సరోజిని. రసూల్ ఆఖరి దమ్ములాగి సిగరెట్ పీకని వరండా చివర కిటికీ దగ్గిరికి విసిరి “ఏడిశాడు” అన్నాడు. అంటూనే ఆపరేషన్ గదిలోకి నడిచాడు.

మావిడితోటలా, జీడిమామిడి తోపులా, తాడి చెట్లూ నగరానికి పచ్చటి అంచులా ఉండేవి. మధ్య, దిగువ మధ్య తరగతివారి గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం తోటల్ని ఆక్రమించి చెట్టుకో ఇల్లూ పుట్టకో ఇల్లూ కట్టింది. తీరా ఇళ్లు కట్టిం తరవాత ఇంట్లో కంటే చెట్లకింద ఉండడవే సుఖవని తెలిపోయింది. స్నానాలగదుల్లో నాలుగున్నర అడుగులకంటే పొడుగున్న వారికి ఎవరికీ స్నానాల గదుల్లో వీపు తోముకునే అవకాశంలేదని కాలనీ సెక్రటరీ అనేశాడు. దిగువకంటే దిగువాతి దిగువ వారికోసం కూడా ఇళ్లు కట్టడానికి కాలనీ వెనక ఉన్న తోటల్ని కూడా కొట్టేశారు. ఇళ్లు కొనుక్కుని వీళ్లకీ చెట్లు పోయి కోతులకీ కళ్లనీళ్ల పర్యంతం అయింది. కాలనీకి దూరంగా ఉన్నా ఊళ్లో కోతుల బెడద ఎక్కువ పోయింది. వాటంతట అవే కోతులు పునరావాసం ఏర్పాటు చేసుకున్నాయి. కుటుం బాలకి కుటుంబాలు ఇళ్లమీద పడి తిన్నవి తిని మొక్కల్ని పీకి పూలకుండీలు విరగ్గొట్టి భీభత్సం సృష్టించి ఊళ్లో కొన్ని ప్రాంతాల్ని శాసన సభల్లా తయారుచేశాయి. కోతులు ప్రతిఘటనోద్యమాన్ని తట్టుకోలేక టపాకాయల దగ్గిర్నించి అనేక ఆయుధాల్ని తయారుచేసుకుని తలుపులు మూసుకుని కూర్చునే పరిస్థితి ఏర్పడింది. చివరికి, కొంతమంది మహిళా కార్పొరేటర్ల ఆరేసిన చీరలు చింపి వాలికలు చేసిన తరవాతగానీ మేయరూ, కమీషనరూ ఒక నిర్ణయానికి రాకతప్ప లేదు. మందు బాధిత ప్రాంతాల కార్పొరేటర్లతో, అధికారులతో ఒక కమిటీ వెయ్యాలని మేయరు సంకల్పించాడు. కానీ మారిసెట్టి భూలోకం అనే కార్పొరేటరు స్పష్టంగా చెప్పింది.

“మీ రిలా కమిటీలు ఏస్తా ఉంటే మాకింక చుట్టుకోడానికి చీరలుండవండి మరి.”

కౌన్సిల్‌లో యధావిధిగా రగడ జరిగిన తరవాత మొత్తానికి ఒక కమిటీ వెయ్యడానికి నిర్ణయం అయింది. కోతుల బెడద ఉన్న ప్రాంతాలని స్పష్టంగా నిర్ధారించడానికీ, సగటున రోజుకి ఎన్ని కోతులు దాడి చేస్తున్నాయో తేల్చడానికీ కమిటీ నగరంలో తిరగాలి గనక నగరపాలికవారు రెండు కార్లు కేటాయించారు. వారంరోజుల తరవాత కమిటీ సమావేశం అయింది. ప్రత్యేక ఆహ్వానితుడిగా నగర శాసనసభ్యుణ్ని కూడా ఆహ్వానించారు. కమిటీ పెద్ద నివేదిక వివరాలు తెలియ చేశాడు. కోతుల్ని పట్టుకుని అడవుల్లో వదిలెయ్యాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. కానీ కోతుల్ని పట్టుకోవడం దగ్గిర కమిటీలో అభిప్రాయభేదాలు తలెత్తేయి. మొత్తం నగరంలో ఎనిమిది ప్రాంతాల్లో కోతుల బెడద ఉందని నిర్ధారించి సగటున కోతుల సంఖ్యని గుర్తించి పట్టుకోడానికి కోతికి ఎంతవుతుందో లెక్క కట్టేరు. తెలుగుదేశం సభ్యులకి వెంటనే అనుమానం తగిలింది.

"అంటే ఈ లెక్క ప్రకారం కోతుల్ని పట్టుకోడానికి కాంట్రాక్టు ఇస్తారన్నమాట. అది గూడా మీ వోళ్లకే ఇచ్చుగుంటారు."

"కాంట్రాక్టు ఇవ్వక తప్పదు. జవాబుదారీ ఉంటుంది. ఇందులో మావోళ్లనేది ఉ ండదండి కోతుల గొడవ మా కాంగ్రెసు వార్డుల్లో ఎక్కువండి మరి. అటువంటప్పుడు పద్ధతి ప్రకారం మాకే కాంట్రాక్టు రావడం న్యాయం గాదేటండి? రోడ్లు గురించి ఎంత పద్ధతిగా పంచుగున్నాం? దీనికి గొడవేటండీ?"

మేయరు కలిగించుకుని కాంట్రాక్టు కాంగ్రెస్‌వారికి ఇవ్వడంలో తప్పులేదని నచ్చచెప్పేడు. టెండర్ల గొడవ లేకుండా సద్దుబాటు చేసుకోవాలని కూడా నిర్ణయం అయిపోయింది. సభ ముగుస్తూండగా ఆరోగ్యశాఖాధికారి లేచి అన్నాడు.

"సార్. కోతుల్ని అడవిలో ఒదిలినా సమస్య పరిష్కారం కాదు సార్. అవి మళ్లీ వెనక్కి వస్తాయి సార్. వాటితో పాటు ఊరు తెలీనివి కూడా వస్తాయి సార్."

మేయరు అతని వేపు అన్నంలో పడ్డ బొద్దింకని చూసినట్టు చూశాడు.

"అయితే ఏవంటారు? కోతుల్ని అలాగే ఒదిలెయ్యమంటారా?"

"నో సార్. మా డిపార్ట్‌మెంటంతా కలిసి ఒక ప్రణాళిక సిద్ధంచేశాం సార్. పూర్వం మహారాష్ట్రలో గూడా ఇదే పద్ధతి ఎద్దులకి చేశారు సార్. ఇదిగో సార్. అన్నీ డీటైల్సుగా ఉన్నాయి సార్. ఇందులో కూడా కాంట్రాక్టర్లకి అవకాశం ఉంటది సార్."

పదిహేను నిముషాల తరవాత కమీషనరూ, మేయరూ నివేదిక చదివి ఎదురుగా ఉన్న గ్లాసుల్లో మంచి నీళ్లు తాగి ఆరోగ్య శాఖాధికారి వేపు చూస్తూ ఉండిపోయారు. మరో పది నిముషాలు పథకాన్ని ఎలా అమలు చెయ్యాలో వివరించి అన్నాడు.

"థేంక్యూ సార్. మనం ఈ ప్రోగ్రాం చేస్తే కోతుల బెడద శాశ్వత ప్రాతిపదక మీద

తీరిపోద్దండి సార్.'' అందరూ సరే నన్నారు.

రసూల్ తలుపు దగ్గిరికి వేసి ఆపరేషను టేబిలు వేపు నిడిచాడు. మేరీ సరోజిని బరువుగా పక్కనే వచ్చి నుంచుంది. ఒకేసారి ఇద్దరూ టేబిలు వేపు చూశారు. గోధుమరంగులో నిస్సహాయంగా కప్పువేపు చూస్తూ కట్టేసిన కాళ్లని కదపడానికి ప్రయత్నిస్తోంది. డాక్టరు దగ్గిరికి రాగానే కళ్లు పెద్దవిచేసి చూసింది కోతి. ట్రేలోంచి మత్తు ఇంజక్షను అందించింది మే.స. పండుకోతి వేపు చూస్తూ ఇం జక్షన్ చేతిలోకి తీసుకున్నాడు రసూల్. కనురెప్పలు టకటక లాడించి అంది కోతి.

"పరవాలేదు. కొంచెం షాకయింది. నేను ముసలి పీనుగుని గదా నాకు కుటుంబ నియంత్రణ ఆపరేషనెందుకు? నాకిప్పుడు లైంగిక సంబంధమైన ఆలోచనలు లేవు.''

తడబడుతూ అన్నాడు రసూలు.

"అది నా కనవసరం. కార్పోరేషను వాళ్లు కాంట్రాక్టుకి కోతుల్ని పట్టుకుని ఆపరేషన్ చేసి అడవుల్లో ఒదిలెయ్యమన్నారు. ఆళ్లు తెస్తారు నేను కోస్తాను. నీవల్ల సరోజిని పడిపోయింది. ఆవిణ్ని నేను లేపలేను.''

దీర్ఘంగా గొట్టపు బావిలా మూలుగుతూ సరోజిని లేచి రసూలు చెయ్యి గట్టిగా పట్టుకుని అంది.

"ఎళ్లిపోదాం. మన్ని దేవుడు కాపాడతాడు.''

ఆపరేషను గది వెనకగదిలో కిటికీ దగ్గిర శబ్దమైంది. మే.స. భయంగా అటువేపు చూసింది. రసూలు చెయ్యి మణికట్టు దగ్గిర విరిగినంతపనైంది. సన్నటి కిటికీ ఊచల ఖాళీలోంచి కోతిపిల్ల లోపలికి రావడానికి ప్రయత్నిస్తూ కిచకిచ మంటోంది. వింటూనే పండుకోతి తల వెనక్కి తిప్పడానికి ప్రయత్నించింది. రెండు కోతులూ కాసేపు కిచకిచమన్నాయి. పిల్లకోతి ఆగి దూరం నుంచే పండు కోతి వేపు కాసేపు చూసి కిందికి గెంతి వెళ్లిపోయింది. పండుకోతికి కళ్లలో నీళ్లు తిరిగేయి. రసూలు వేపు చూసి అంది.

"నా మనవడు వనాఫ్ సెవెంటీ.(1/70)''

రసూలు చెయ్యి పట్టుకునే మే.స. గుండ్రంగా ఒణికిపోతోంది.

"ఎవరూ?'' అన్నాడు రసూలు.

"నా మనవడు 1/70. వనాఫ్ సెవెంటీ అని ముద్దు పేరు. వాళ్లు తప్పించుకున్నారు. నన్ను బండ్లో పారెయ్యడం చూసి వెతుక్కుంటూ వచ్చేడు పిచ్చిముండ.''

సన్నగా మూలిగి మే.స. దభీమని మళ్లీ నేల కూలిపోయింది. రసూలు మే.స. మేటు వేపు కంగారుగా చూశాడు. పండుకోతి అంది.

"ఎన్ని కు.ని. ఆపరేషన్లు చేస్తావు?''

“ఏమో. ఆళ్లు ఎన్ని చెయ్యమంటే అన్ని. నేను గవర్నమెంటు పశువుల డాక్టర్ని. మాటాడకుండా పడుకో. తరవాత వదిలేస్తాం.”

“ఆగు రసూలూ. ఈ వయసులో నా కెందుకు? ఏది ఎవడు చెప్తే అది చేసెయ్యడమవేనా? నీకు బుర్రలేదా?”

“ఉంది. డ్యూటీలో ఉండగా దాంతో పని లేదు.”

“సరే. నువ్వు మంచివాడిలా ఉన్నావు అలా కూచో. నీకు కొన్ని విషయాలు చెప్తాను. విను. ఆలోచించడం అలవాటవుతుంది.”

. . .

చెప్పడం ఆపి భిక్షువుల వేపు సాలోచనగా చూసి చిరునవ్వుతో అన్నాడు శాస్త.

‘అంధక భిక్షువులు నగరపాలిక సభ్యులు. ఉపాసిని వకుళ వైద్యుడి సహాయకురాలు.” భవిష్య కథ విన్న అక్కడి భిక్షువు లందరూ శ్రోతాపత్తి ఫలాన్ని పొంది శాస్తకి నమస్కరిస్తూ లేచేరు.

(1/70 చట్టం. దీని ప్రకారం అటవీ భూములు గిరిజనేతరులు సొంతం చేసుకోకూడదు.)